# నవతరం పరిశోధనలు - 13

## తెలంగాణ దళితవాదనవలలు - సమగ్రపరిశీలన (1975 - 2020)



**గోమారపు కవిత**, తెలుగుశాఖ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
**సెల్** : 9502439748. **మెయిల్** : gk8958245@gmail.com
**కోర్సు**: Ph.D. **రీసెర్చ్ ఏరియా**: దళితవాద సాహిత్యం
**పర్యవేక్షకులు**: ఆచార్య రెడ్డి శ్యామల. **పరిశోధన కాలం**: 2021 నుండి 2026

తెలుగుసాహిత్యంలో సామాజికవాస్తవాలను ప్రతిబింబించే దళితవాద సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో దళితుల జీవనవిధానం, వారు ఎదుర్కొన్న సామాజిక అణచివేత, అన్యాయాలు, అసమానతలు వంటి అంశాలను ప్రతిబింబించే నవలలు దళితవాద సాహిత్య వికాసానికి దోహదపడ్డాయి. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గోమారపు కవిత, సురవరం ప్రతాపరెడ్డి తెలుగువిశ్వవిద్యాలయం పరిధిలో, ఆచార్య రెడ్డి శ్యామల గారి పర్యవేక్షణలో 'తెలంగాణ దళితవాదనవలలు – సమగ్ర పరిశీలన' అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేస్తున్నారు. చిన్ననాటి నుంచే సమాజంలోని వర్గ అసమానతలు, దళితులపై జరుగుతున్న అన్యాయాల పట్ల ఉన్న అవగాహనతో పాటు దళిత సాహిత్యంపై కలిగిన ఆసక్తి ఈ పరిశోధనకు ప్రేరణగా నిలిచాయన్నారు. తెలంగాణలో వెలువడిన దళితవాద నవలల ద్వారా దళితుల వాస్తవిక జీవన పరిస్థితులు, సామాజిక అణచివేతలు, హక్కుల కోసం జరిగిన పోరాటాలు వంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో ఈ పరిశోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాజంలో దళితులు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎదుర్కొంటున్న అణచివేతలు, వివక్షలు దళితవాద సాహిత్య ఆవిర్భావానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే దళితుల జీవన పరిస్థితులు, వారికి లభించని సామాజిక స్వేచ్ఛ, విద్యా అవకాశాల కొరత, ఆర్థిక అసమానతలు వంటి అంశాలు దళితవాద నవలల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా నిజాంపాలనలో దొరల ఆధిపత్యం, స్వాతంత్ర్యానంతరం కొనసాగిన సామాజికమైన వెనుక-బాటుతనం, పటేల్- పట్వారి వ్యవస్థలో దళితుల దుర్భరజీవనం వంటి చారిత్రక, సామాజిక పరిస్థితులను ఈ నవలలు ఆవిష్కరించాయి. ఈ నేపథ్యంలో 1975 నుండి 2020 వరకు వెలువడిన తెలంగాణ దళితవాదనవలలను పరిశోధన పరిధిలోకి తీసుకొని, వాటిలో కనిపించే వస్తువైవిధ్యం, సామాజికచిత్రణ, దళితుల జీవనవిధానం, చైతన్యభావజాలం వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేస్తున్నారు. ముఖ్యంగా వర్ణవ్యవస్థ ప్రభావం, సామాజిక అసమానతలపై దళితుల ప్రతిఘటన, గ్రామీణ జీవన చిత్రణ, కుటుంబసంబంధాలు, స్త్రీస్థానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలిస్తూ సంబంధిత గ్రంథాలు, నవలలు, ఇతర ఆధారాలను సేకరించి ఈ పరిశోధనను కొనసాగిస్తున్నారు.

పరిశోధన సౌలభ్యం గురించి ప్రాథమికంగా వీరీ సిద్ధాంతగ్రంథాన్ని ఐదధ్యాయాలుగా విభజించారు. అవి: తెలంగాణలో దళితుల స్థానం; తెలంగాణ దళితవాద నవలలు - ఆవిర్భావవికాసాలు; తెలంగాణ దళితవాదనవలల్లో వస్తు వైవిధ్యం; తెలంగాణ దళితవాదనవలలు - సామాజిక, సాంస్కృతిక విశేషాలు; తెలంగాణ దళితవాదనవలలు - దళితుల జీవన విధానం, దళిత చైతన్యం. తెలంగాణ దళితవాద నవలలపై ఇప్పటివరకు సమగ్రపరిశోధనలు చాలా తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరిశోధన ఆలోటును కొంతవరకు పూరించగలదని భావించవచ్చు. భవిష్యత్తు పరిశోధకులకు దళితసాహిత్య అధ్యయనంలో ఈ సిద్ధాంతగ్రంథం స్ఫూర్తిగా నిలుస్తుంది.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 14



## శ్రీకాకుళంజిల్లా జానపదసంస్కృతి - పరిశీలన


**కీలు ఖగపతి,** తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

**సెల్**: 9502223570. **మెయిల్**: kkhagapathi@gmail.com

**కోర్సు**: Ph.D. **రీసెర్చ్ ఏరియా**: జానపదసాహిత్యం

**పర్యవేక్షకులు**: డా. కె. వెంకటరమణ. **పరిశోధనకాలం**: 2022 నుండి 2028


శ్రీకాకుళంజిల్లా జానపదసంస్కృతి అనే అంశం ప్రాంతీయసంస్కృతి, జానపదసంప్రదాయాల అధ్యయనంలో ప్రాధాన్యమున్న పరిశోధనావిభాగంగా భావించవచ్చు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయనశాఖ పరిధిలో కీలు ఖగపతి డా. కె. వెంకటరమణ గారి పర్యవేక్షణలో 'శ్రీకాకుళంజిల్లా జానపదసంస్కృతి – పరిశీలన' అనే అంశంపై పిహెచ్.డి. పరిశోధన చేస్తున్నారు. శ్రీకాకుళంజిల్లా, గ్రామీణ సమాజ జీవనవిధానంతో ముడిపడి ఉన్న జానపదసంస్కృతి ప్రజల ఆచారాలు, సంప్రదాయాలు, కళారూపాలు, గేయాలు, భాషావిశేషాలు వంటి అనేక అంశాల సమాహారంగా ఈ పరిశోధనను రూపొందిస్తున్నారు.

శ్రీకాకుళంజిల్లా జానపదుల జీవనవిధానంలో అంతర్భాగంగా ఉన్న జానపదసంస్కృతిని సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ పరిశోధన ప్రధానలక్ష్యం. ముఖ్యంగా ఈ జిల్లాలో ప్రాచుర్యంలో ఉన్న జానపదగేయాలు, కళారూపాలు, జాతరలు, ప్రజల ఆచారవ్యవహారాలు, జీవనవిధానాలు వంటి అంశాలను సేకరించి వాటి సాంస్కృతికప్రాముఖ్యతను వెలికితీయడం ఈ అధ్యయన ఉద్దేశ్యం. కాలానుగుణమైన మార్పులతో క్రమంగా అంతరించిపోతున్న జానపదసంపదను సేకరించి గ్రంథస్థం చేయడం ద్వారా తెలుగు సాహిత్యానికి మరియు భావితరాలకు దానిని పదిలంగా అందించగలమని కీలు ఖగపతి అభిప్రాయపడ్డారు.

ఈ పరిశోధన ప్రధానంగా క్షేత్రపర్యటన పద్ధతిని అనుసరించి సాగుతుంది. ప్రాథమికంగా వీరు తమ సిద్ధాంత గ్రంథాన్ని ఏడధ్యాయాలుగా విభజించారు. అవి: శ్రీకాకుళం జిల్లా భౌగోళిక - చారిత్రక నేపథ్యం; శ్రీకాకుళంజిల్లా జానపద సంస్కృతి - భాషావిశేషాలు; శ్రీకాకుళంజిల్లా జానపదుల సంస్కృతి, సాంప్రదాయాలు - విశేషాలు; శ్రీకాకుళంజిల్లా జానపద సంస్కృతిని ప్రతిబింబించే కళారూపాలు; శ్రీకాకుళంజిల్లా జానపదులు - గేయసాహిత్యం; శ్రీకాకుళంజిల్లా జానపద సంస్కృతిలో మిళితమై ఉన్న వస్తు వైవిధ్యం; శ్రీకాకుళంజిల్లా జానపదసంస్కృతిలో ఆధునికధోరణులు.

జానపదసంస్కృతి ఒక ప్రాంత ప్రజల సామూహిక జీవన అనుభవాలను, సాంస్కృతికవారసత్వాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన ఆధారం. ఈ నేపథ్యంలో శ్రీకాకుళంజిల్లా జానపదసంస్కృతిని సమగ్రంగా పరిశీలించి స్థానికసంస్కృతిని గ్రంథస్థం చేసి భావితరాలకు అందించాలనే సదుద్దేశంతో సాగుతున్న ఈ పరిశోధన జానపద అధ్యయనాల విస్తరణకు తోడ్పడటంతో పాటు భవిష్యత్ పరిశోధకులకు కూడా మార్గదర్శకంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 15

## కేంద్రసాహిత్యఅకాడమీ అవార్డు పొందిన రచయిత్రుల రచనలు-విశ్లేషణ (2010-2020)



**గంధం రోజమ్మ,** తెలుగు అధ్యయనశాఖ, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు.
**సెల్:** 9789024039. **మెయిల్:** rojagandham026@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** ఆధునికసాహిత్యం
**పర్యవేక్షకులు:** ఆచార్య కె. ఆశాజ్యోతి. **పరిశోధనకాలం:** 2023 నుండి 2028

బెంగళూరు విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయనశాఖలో ఆచార్య కె. ఆశాజ్యోతి గారి పర్యవేక్షణలో "**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచయిత్రుల రచనలు – విశ్లేషణ (2010–2020)**" అనే అంశంపై గంధం రోజమ్మ పిహెచ్.డి. పరిశోధన చేస్తున్నారు. ఈ పరిశోధనలో 2010 నుండి 2020 మధ్యకాలంలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న రచయిత్రుల రచనలను ఎంపిక చేసుకొని ఆయా రచనలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేస్తున్నారు. రచయిత్రులు తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియల ద్వారా వ్యక్తపరచిన భావాలను, సాహిత్యదృక్పథాలను పరిశీలించాలనే ఉద్దేశంతో ఈ పరిశోధన కొనసాగుతోందని వీరు తెలిపారు.

కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచయిత్రుల రచనలను పరిశీలించడం ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో రచయిత్రుల రచనల స్వరూపస్వభావాలను అర్థం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కథ, వ్యాసం, కవిత్వం వంటి ప్రక్రియలలో రచయిత్రులు వ్యక్తపరచిన భావజాలం, సమకాలీనసామాజికసమస్యలపై వారి స్పందన, వ్యక్తిగత అనుభవాల ప్రతిఫలనం వంటి అంశాలను విశ్లేషించడం ఈ అధ్యయనంలో ముఖ్యభాగమని తెలిపారు. ఈ ప్రక్రియల ద్వారా మహిళా రచయిత్రుల సాహిత్యదృష్టి, భావవ్యాప్తి వంటి అంశాలను పరిశీలించడానికి ఈ పరిశోధన సహాయపడుతుందని రోజమ్మ పేర్కొన్నారు.

వీరు ఈసిద్ధాంతగ్రంథాన్ని ప్రాథమికంగా ఐదధ్యాయాలుగా విభజించారు. అవి: కేంద్రసాహిత్య అకాడమీ ఆవిర్భావం- నేపథ్యం; కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచనలు; కథాసాహిత్యం; వ్యాసప్రక్రియ; కవిత్వం.

రచయిత్రుల సాహిత్యాన్ని కేంద్రంగా చేసుకొని జరుగుతున్న ఈ అధ్యయనం ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా రచనల స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయుక్తంగా ఉండగలదని భావించవచ్చు. ముఖ్యంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన రచయిత్రుల రచనలను సమగ్రంగా పరిశీలించడం ద్వారా సాహిత్య పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని అందించడంలో ఈ సిద్ధాంతగ్రంథం సహాయపడుతుంది. భవిష్యత్తులో రచయిత్రుల సాహిత్యంపై జరిగే పరిశోధనలకు ఈ సిద్ధాంతగ్రంథం స్ఫూర్తిగా నిలుస్తుందని భావిస్తున్నాను.

**- సంపత్ కుమార్ బానోజి**

**(మరికొన్ని పరిశోధనల పరిచయం వచ్చే సంచికలో...)**